వాడ్రేవు చినవీరభద్రుడు

# జ్యోతిర్మయ రోదసి

## మరికొన్ని కవితలు



వాడ్రేవు చినవీరభద్రుడు


# జ్యోతిర్మయరోదసి



వాడ్రేవు చినవీరభద్రుడు

# జ్యోతిర్మయరోదసి

మరికొన్ని కవితలు



JYOTIRMAYA RODASI

A collection of poems by

Vadrevu Ch Veerabhadrudu

April, 2026

Cover image:

Composing and Lay-out
Vadrevu Ch Veerabhadrudu

Back cover photography:
AmruthaPurna Vadrevu

e-book released by
Vadrevu Ch Veerabhadrudu
First Floor, House No.56, Navodaya Colony
Mehdipatnam
HYDERABAD, Telangana state, 500 028
chinaveera@gmail.com
mobile: +91 94909 57129

For more resources please visit:
www.chinaveerabhadrudu.in

కొప్పరపు లక్ష్మీ నరసింహారావుగారికి

# నాలుగు దశాబ్దాలుగా

**గోదావరి తీరంలో,** రాజమండ్రిలో గౌతమీ గ్రంథాలయంలో, నా తొలి కవితాసంపుటి 'నిర్వికల్పసంగీతం' మా బామ్మగారి చేతులమీదుగా విడుదలై నేటికి సరిగ్గా నాలుగు దశాబ్దాలు గడిచాయి.

నా తల్లిదండ్రులతో సహా ఆనాడు ఆ సభలో ఉన్న శరభయ్య గారు, సుదర్శనం గారు, జగన్నాథరావుగారువంటి గురువులతో సహా సుబ్రహ్మణ్యం, మహేశ్, గోపీచంద్ లాంటి నా రాజమండ్రి మిత్రులు కూడా ఈ రోజు నా పక్కనలేరు. కాని వారు తమ ఆశీస్సులతో పాటు కవిత్వాన్ని కూడా నాకు తోడుగా విడిచిపెట్టి వెళ్లారు. ఈ నలభయ్యేళ్ళల్లో నేనెన్నో ముళ్ళదారుల్లో నడిచాను. ఎన్నో అగ్నిపరీక్షలు ఎదుర్కొన్నాను. కాని ఈ రోజు వెనక్కి తిరిగి చూసుకుంటే అప్పుడు రాసుకున్న కవితలూ, వాటిని వెన్నంటి నా మదిలో మెదిలే ఆ అడవులూ, ఆ కొండలూ, ఆ నదులూ, ఆ కొంగలూ, ఆ కోకిలా తప్ప మరేమీ గుర్తు రావడం లేదు. 'నా జీవితంలో నిరంతరం నిన్ను పాటల్తో వెతికాను' అన్నాడు టాగోరు సర్వేశ్వరుడితో. ఆ మాట నాది కూడా. ఇన్నేళ్ళూ నన్ను నిలబెడుతూ వచ్చిన భగవత్కృపకి గుర్తుగా నాకు తోడుగా నిలబడ్డది కవిత్వమే.

ఇప్పుడు కవిత్వం తప్ప మరేదీ నన్ను ఆకర్షించడం లేదు. సంగీతకారులు ప్రతి రోజూ ప్రాతఃకాల వేళ సాధన చేస్తుంటారని విన్నాను. కవిత్వం చదువుకోవడం, రాసుకోవడం, ఇదే నాకు మిగిలిన జీవితకాల ప్రార్థన.

హైదరాబాదు
28-3-2026

**వాడ్రేవు చినవీరభద్రుడు**

# వరసగా


తలుపులు బార్లా తెరుచుకుంటాయి 11
ఇద్దరు ముసలమ్మలు 14
అమ్మకి ఉత్తరం 16
ప్రతిరోజూ పండగే 18
తుకారాముడిలాగా 21
జ్యోతిర్మయ రోదసి 23
తెల్లవారి లేస్తూనే 25
తొలి కూజితం 26
రసవితరణ 28
భగవంతుడి గులాబితోట 29
ఏప్రిల్లో ఒక రోజు 31
ఒక రోజంతా ఎండలో రగిలిపోయేక 33
వసంతమేఘగర్జన 35
ఇప్పుడు మిగిలిన స్నేహాలు 36
హైకుసాయి తెలుసు కద! 38
సాయంకాలానికల్లా 40
వేసవివాన వచ్చివెళ్ళాక 42

| | |
|---|---|
| నగరం పుట్టకముందు నగరం | 43 |
| వసంతఋతువు చివరిరంగు | 46 |
| ఆ ఉత్తరంలో | 47 |
| మంత్రమయపవనం | 48 |
| అక్కర్లేని చుట్టం | 49 |
| ఇప్పుడు నాక్కూడా అనుభవం | 50 |
| ఇప్పటికి తెలిసింది | 51 |
| వానపడ్డ రాత్రి | 52 |
| వానలు పడుతున్నంతసేపూ | 53 |
| భగవంతుడి చేతులు | 55 |
| కవిత్వం రాసుకోవడం | 57 |
| నీడల్లేని కాలం | 59 |
| చాలా రోజులుగా | 60 |
| నేను కోరుకునేదొక్కటే | 61 |
| ఈ కాలమే అలాంటిది | 62 |
| ఉత్తర ద్వారం | 63 |
| మధువిద్య | 64 |
| ఇంతకన్నా మరేం కావాలి? | 66 |
| పరుసవేది | 67 |
| సంక్రాంతి | 69 |
| గాలిపటాలు పూసేకాలం | 70 |
| కవిత పూర్తవుతుంది | 71 |

| | |
|---|---|
| రెండో చరణం | 72 |
| మాఘపురాణం | 73 |
| సహశయానులు | 75 |
| కిరణజన్య సంయోగక్రియ | 76 |
| నేనూ ఇంతే కద! | 77 |
| జుగల్‌బందీ | 78 |
| ఈ ఊరు వదిలి, ఈ వీథివదిలి | 80 |
| ఈ చెట్టు | 82 |
| సాధారణంగా చెట్లు | 84 |
| కానుగచెట్టు దినచర్య | 85 |
| వసంతం వచ్చే ముందు | 86 |
| ఫాల్గుణమాసంలో రంజాన్ | 87 |
| నిజంగా నిద్రలేచినవాళ్ళు | 88 |
| సద్గోష్ఠిసమానం | 89 |
| దాగుడుమూతలాట | 90 |
| పూర్తిగా కళ్ళు విప్పుకుని | 91 |
| మనమెక్కడున్నాం? | 92 |
| ముంగిట్లో నీళ్ళగోలెంలాగా | 93 |
| పరిమళస్పర్శ | 94 |
| కవీ, కోకిలా, లోకమూ | 95 |
| చైత్రచంద్రబింబం | 96 |
| ఈ రోజుకి మాత్రం | 99 |
| క్రమం తప్పని కోకిల | 100 |

## తలుపులు బార్లా తెరుచుకుంటాయి

కార్తిక ప్రభాతాల్లో నదీస్నానంకోసం
కొందరు సంవత్సరమంతా
ప్రతీక్షించినట్టు
మాఘమాసపు సాయంకాలాల గాలులకోసం
నేను ఏడాదిపొడుగునా
ఎదురుచూస్తాను.

సంగీతం నీ వీనుల్లోంచి
ఒంట్లోకి ప్రవహించినట్టు
మాఘమాసపు నునువెచ్చనిగాలి
నీ దేహమ్మీంచి
హృదయాన్ని చేరుకుంటుంది.

ఇక్కడ ఈ కాలనీలో
ఈ వీథుల్లో నడుస్తుంటానా
ఎక్కడిదో ఎప్పటిదో కొండగాలి
నాకోసం వెతుక్కుంటూ వస్తుంది.

ఆకాశం జారవిడిచిన
ప్రేమలేఖల్లాగా
గాలిపటాలు
ప్రతి చెట్టుమీదా.

రంగువెలిసిపోయిన
ఆ అక్షరాలమీద
మసకమసగ్గా
మంచురాత్రుల బెంగ.

నిండుగా పూసినమామిడిచెట్టు
పాతపాటలు మళ్ళా
కొత్తగా పాడటం మొదలుపెడుతుంది.
అప్పుడు నేను పీల్చే ప్రతి ఊపిరిలోనూ
వీథి, నగరం, విశ్వమంతా
ఒక తీపిదనంగా నాలోకి ప్రసరిస్తాయి.

నాలో ఎంత వేదన,
లోకంలో ఎంత వేదన-
కాని నాలోకి ప్రవహించిన లోకం
కొంతసంతోషం నాకిచ్చి
నాలోంచి కొంత మాధుర్యం
తోడుకుంటుంది.

ఈ ఇచ్చిపుచ్చుకోడాలు
ప్రతి ఏడాదీ జరుగుతాయి.
గాయకుడు గాల్లోంచి స్వరాలు ఏరి
రాగంగా కూర్చుకున్నట్టు
గాలి తన అంగుళుల్తో
నాలోంచి ఒక పాటని
నిద్రలేపుతుంది.

పోగుపడుతున్న ఎండుటాకులు
రిక్తమవుతున్న శాఖోపశాఖలు-
మాఘమాసపు చెట్లకింద
నడుస్తున్న ప్రతిసారీ
ఆకాశం మరింత వెల్లడైనట్టు
తలుపులు బార్లా తెరుచుకుంటాయి.

7-2-2025

## ఇద్దరు ముసలమ్మలు

పండగ వస్తోందంటే
అన్నిటికన్నా ముందు
మా అమ్మ
ఇల్లు బూజు దులిపేది.
మట్టి అరుగులు చెక్కుతీసేది
గోడలు మెత్తడానికి
ఎర్ర మన్ను కలిపిపెట్టుకునేది.

ఇల్లంతా దులిపి తుడిచి
గోడలు మెత్తి
ఒద్దిగ్గా సరిదిద్దుకున్నాక
దాకరాయి గ్రామం నుంచి
ఇద్దరు ముసలమ్మలొచ్చేవారు
గోడలకి వెల్లవేయడానికి
చేతుల్లో చీపుళ్ళూ
సున్నం బకెట్లతో.

తెల్లటి రెక్కలు చాపి
వాళ్ళ వెనగ్గా
వాలేదప్పుడు పండగ.

నెల్లాళ్ళుగా చూస్తున్నాను
బూజు దులుపుకుంటున్న చెట్లని.

వాటి బోలుకొమ్మలచుట్టూ
గాలిపెట్టే గిలిగింత.
దూరదిగంతపు నునువెచ్చని
పలకరింపుకి
వాటిలోపల్లోపల ఒక పులకింత.

నేను కూడా ఇన్నాళ్ళుగా
కూడబెట్టుకున్న పదాల్ని రాల్చేస్తున్నాను.
నా మనసునిండా కిక్కిరిసిన
సామాను ఖాళీచేసేస్తున్నాను.

నామదేవుడితో కలిసి
పాండురంగడు
తుకారాముడికలలోకొచ్చినట్టుగా
ఇప్పుడింక ఆ
ముసలమ్మలిద్దరూ
మా ఇంటికెప్పుడొస్తారా అని
ఎదురుచూస్తున్నాను.

11-2-2025

## అమ్మకి ఉత్తరం

లేదు, కవిత రాయడం
వాయిదా వెయ్యలేవు
అమ్మకి రాయాల్సిన ఉత్తరంలాగా
కవిత రాసేదాకా
నీ మనసు కుదుటపడదు.

అమ్మకే కదా ఉత్తరం
ఎప్పుడన్నా రాద్దాములే అనుకుంటావుగాని
అంతకన్నా ముఖ్యమైన పని
మరేముంటుందిగనుక?

నువ్వు క్షేమంగా ఉన్నావని
అత్యవసరంగా చెప్పవలసింది
అమ్మకే కద.

అమ్మ నీకు నేర్పిన భాషలోనే
అమ్మకు ఉత్తరం రాసేటప్పుడు
అమ్మ తప్ప నీ మనసులో
మరేమీ ఉండదు.

ప్రపంచం గురించి అమ్మకెందుకు?
నువ్వు కులాసాగా ఉన్నావన్న
రెండు ముక్కలు చాలామెకి.

ఎలా ఉన్నావమ్మా
అని నువ్వడిగే రెండు మాటలు
చాలామెకి.

నీకు తెలుసు కదా
నీ ఉత్తరం అందినప్పటినుంచీ
ఆమె మళ్ళా మరో ఉత్తరం కోసం
ఎదురుచూస్తూనే ఉంటుంది.

18-2-2025

## ప్రతిరోజూ పండగే

అదే వీధి, అడ్డదిడ్డంగా అవే కరెంటుతీగలు
అదే దుమ్ము, అవే బిల్డింగులు
అదే మార్కెటు, అవే హారన్లు
వాటిమధ్య అకస్మాత్తుగా
ఆకుపచ్చని ఫౌంటెను తెరిచినట్టు
మా ఇంటిముందు కానుగచెట్టు.

పండగరోజుల్లో గంగిరెద్దు
ఇంటిముందుకొచ్చినట్టు
ఇప్పుడీ కానుగచెట్టు మా వీథిలో.

గంగిరెద్దూ తనే
సన్నాయి ఊదుతున్నదీ తనే
మధ్యలో ఉండీ ఉండీ
నెమలీకల కుచ్చు పైకెత్తి
నోరారా దీవించినట్టు
తెరలు తెరలుగా
ఒక మిలమిల.

ఇన్నాళ్ళుగా చీకటినేలలో
ఆ వేర్లు ఏ సంగీతసాధన చేసాయో

ఇప్పుడిలా చెట్టు మొత్తం
ఒక నాదస్వరంగా నినదిస్తున్నది.

కాలం ఒకచెట్టుతో
ఇలా రాగాలాపన చేయించగలదని
నాకిప్పటిదాకా తెలీదు.
తానున్నచోటనే ఉంటూ
వెలుగునిట్లా విరజిమ్మగల
విద్య నాకెవరూ నేర్పలేదు.

కొమ్మల్లోంచి గగనంలోకీ
గగనమ్మీంచి కొమ్మల్లోకీ
పక్షులు ఎగురుతున్నట్టు,
తిరిగి మళ్ళా వాలుతున్నట్టు
చెట్టు నిండా
ఒక ధగధగ.

చెట్టుకీ, సూర్యుడికీ మధ్య
యుగాలుగా నడిచే ఒక సంభాషణ-
నాకు ఆ మాటలు అర్థంకావట్లేదుగానీ
ఆ భాష చిరపరిచితమే.

ఏ పారా పలుగూ లేకుండానే
కరచరణక్లేశంలేకుండానే
బంగారాన్నిట్లా
తవ్వితీయొచ్చని నాకిప్పుడే తెలిసింది.

వెలుతురు ఊట
చేతాళాల గణగణ-
ఈ గంగిరెద్దు ఇక్కడున్నంతకాలం
ప్రతిరోజూ పండగే.

20-2-2025

## తుకారాముడిలాగా

తుకారాముడిలాగా
నేను కూడా నా దుకాణం
మొత్తం పరిచిపెట్టాను.

నాతో పాటు
కానుగచెట్టు కూడా.

ఎవరికి కావలసింది
వారు తీసుకోవచ్చు.

మేమిద్దరం పుణికిపుచ్చుకున్న
ఫాల్గుణ మాసం
మా దోసిలిమీంచి
వీథిలోకి పొంగిపొర్లుతోంది.

ఈ ఆకుపచ్చని షామియానా కిందకి
ఎవరు వచ్చి నిలబడ్డా
వారి అదృష్టానికి
ఆశ్చర్యపోతుంటాను.

నమ్మకమైన కొనుగోలుదారుడికోసం
ఓపిగ్గా ఎదురుచూడవలసి ఉంటుందని
మాకు తెలుసు.

అతడికి మాత్రమే తెలుస్తుంది
ఇక్కడ ఏ ఒక్కటి తీసుకున్నా
మొత్తం దుకాణమే తనవెంట
వచ్చేస్తుందని.

1-3-2025

# జ్యోతిర్మయ రోదసి

(మొన్న సాయంకాలం కె.బి.ఆర్ పార్కుపక్కనుంచి వెళ్తున్నప్పుడు నిండుగా వికసించిన ఒక మోదుగచెట్టు హటాత్తుగా పలకరించినప్పుడు-)

మోదుగపూలని చూడకుండానే ఈ మాఘమాసం
గడిచిపోయిందనుకున్నాను, కాని, నా కోసం కూడా
బెంగపెట్టుకుంది పలాశం.

ప్రతి ఒక్కదాన్నుంచీ నువ్వు దూరంగా జరిగినప్పుడు
నీనుంచి ప్రతి ఒక్కటీ దూరంగా జరిగినప్పుడు-
అప్పుడు కూడా
ధూసరవర్ణ క్షేత్రాలమీద, పొగలాంటి అడవులమ్మట
ప్రసరించే విద్యుత్కాంతి ప్రవాహానికి
నిలబెట్టిన రాగిచుట్టల్లాగా
ఎగరేసిన జెండాల్లాగా ఎలుగెత్తిన పద్యాల్లాగా
మోదుగలు పూసే కాలమొకటి ఉంటుంది.

ఎఱ్రని మట్టిగాజుల చేతుల్తో నేల
నింగిముఖాన్ని తనవైపుకు తిప్పుకునే తావులుంటాయి.
అడవులు కొండలు పల్లెలు పొలాలు
కించిద్విద్యున్మయ రాగమొకటి సాధనచేస్తూంటాయి.
నువ్వు నడవక తప్పని ఆ బీడుభూముల్లో కూడా
వికసించే రోచిర్మయ కాలమొకటి ఉంటుంది.

కాలం రెండు విధాలు: న్యూసు పేపర్ల కాలమొకటి
పూలూ పక్షులూ, చెట్లూ చేమల కాలమొకటి.
వార్తాపత్రికలు నిన్ను తమవైపు గుంజుకోవాలని చూస్తాయి.
నువ్వేమో పక్షులవైపు, పలాశలవైపు పయనించాలని
పెనగులాడుతుంటావు.

చిరకాలంగా నడుస్తున్న
ఈ నలుగులాటనుంచి
నిన్ను బతికిస్తున్నదేది?
శీర్ణపత్రశుష్కకాలానికి ఆవలవున్న
అనుగ్రహసీమ.

అక్కడ మోదుగచెట్ల అడివిలో
పాడుతున్నవాళ్ళెవరో కనబడరుగాని
పాట వినిపిస్తూనే ఉంది.
వృద్ధి క్షీణతల కాలాన్నిదాటి
నువ్వొక్క అడుగూ వేసే కొద్దీ
నీకొక ఆశీర్వాదం తోడు రావడం
గమనిస్తున్నావు కద!

అయినా ఇంకా మాటిమాటికీ మధ్యలో
వెనుదిరిగి చూస్తావెందుకు?
నువ్వీ దైనందినకక్ష్య దాటాలేగాని
ఆపైన ఉండేదంతా జ్యోతిర్మయ రోదసి.

7-3-2025

## తెల్లవారి లేస్తూనే

తెల్లవారి లేస్తూనే హాల్లోకి వచ్చి నిలబడేటప్పటికి
ఎదట వీధినంతా హాలుగా మార్చేసి కానుగచెట్టు.
నునువెచ్చని నీడల పరదాల్ని పొందిగ్గా మడిచిపెట్టి
అతిథుల్ని ఆహ్వానిస్తూ తలుపులు తెరిచిపెడుతుంది.

ఆ ఆకుపచ్చని గుబుర్లనిండా తాజా పరిమళం.
చూడబోతే చెట్టు బర్త్ డే కేక్ సిద్ధం చేస్తున్నట్టుంది.
అరేబియా కథలోలాగా నా పొరుగువాడు రొట్టెలు
చేసుకుంటూ ఉంటే ఆ సువాసన నాకు దక్కుతుంది.

ఇంతలో ఊదారంగు తెల్లని మొగ్గలు చిరుగంటలు
మోగిస్తూ హాపీ బర్త్ డే పాట మొదలుపెడతాయి.
ఫలానా అని పేరు చెప్పలేవు గానీ ఆ క్షణాన నీకు
గుర్తొచ్చేవాళ్ళంతా అక్కడికొచ్చినట్టే అనిపిస్తుంది.

11-3-2025

## తొలి కూజితం

చాలా ఏళ్ళ కిందట
బహుశా నా ఇరవయ్యేళ్ళప్పుడు
ఒక తెల్లవారుజామున
మగతనిద్రలో ఎవరివో మాటలు:
మా అమ్మనెవరో ఏదో అడుగుతున్నారు
మధ్యమధ్య మసకమసగ్గా నా పేరు.

నిద్రతేలిపోయింది.

'ఎవరితో అమ్మా మాట్లాడుతున్నావు
నా కలలోనా నిజంగానా?'
'ఎదురింటి అమ్మాయిరా!
నువ్వెప్పుడొచ్చావని అడుగుతోంది.'

పుస్తకంలో పెట్టుకున్న పూలరేకలాగా
ఆ కుశలప్రశ్న
ఇన్నాళ్ళూ గుర్తేలేదు.
ఈ ఋతువుని నిద్రలేపుతూ
ఈ పొద్దున్నే కోకిల వచ్చివాలినదాకా.

పూర్వకాలపు గ్రామాల్లో
ఎవరింటికి చుట్టమొచ్చినా

ఊరంతా తుళ్ళిపడ్డట్టు
ఈ తొలి కూజితం
నన్ను కుదిపేసింది.

ఇంక నిద్రపట్టదు.

20-3-2025

## రసవితరణ

పగలంతా ఒక ప్రపంచం. ఎండ, దుమ్ము
హారన్లు, పెట్రోలు, పొగ, పరుగులుపెట్టే రోడ్లు-
రాత్రయ్యాక, నెమ్మదిగా లోకం సద్దుమణిగాక
తీపిగాలుల రెక్కల మీద పాటలు దిగివస్తాయి.

ఆ గానంలో నాకూ గొంతుకలపాలని ఉంటుంది
కాని మాటలు పెగలవు, ఏం చేస్తే నేనొక సునాద
సుగంధాన్ని కాగలనో తెలీదు. అయినా ప్రతి రాత్రీ
నాకు తెలిసిన ప్రతి పూర్వకవినీ ప్రార్థిస్తోనే ఉన్నాను.

ఇది నా అవస్థ. కాని రెండు ప్రపంచాల మధ్య
నిలబెట్టిన అత్తరుకలశంలాగా నిండుకానుగచెట్టు.
నీళ్ళు నింపిన కొత్తకుండ నిలువెల్లా ఊటలూరినట్టు
ప్రతికొమ్మలోంచీ పరిమళం పొంగిపొర్లుతుంది.

వెలుగులు పువ్వులుగా, నీడలు పత్రాలుగా రెండు
ప్రపంచాల్ని ఒక్క ప్రపంచంగా మార్చుకునే తావు-
రాత్రింబవళ్ళు నడిచే రసవితరణ- ఇక్కడ నువ్వొక
చీమవి కాగలిగినా ఒక చక్కెర బిడారు చిక్కుతుంది.

22-3-2025

# భగవంతుడి గులాబితోట

How should a morsel digest without the sight of Him,
without the view of His roses and rose-garden?

Rumi, Masnavi, 2: 3080

ఈసారి ఫాల్గుణమాసం
ఉపవాసదీక్ష పాటిస్తోంది
ఆకాశపు మీనారు లోంచి కోకిల
వేకువనే ప్రార్థనకు పిలుస్తోంది.

భగవంతుణ్ణి తలుచుకోకుండా
రొట్టె తింటే అది తన గొంతుకి
అడ్డుపడుతుందనుకునేవాడు
రూమీ.

ఆయన తోటల్లో విరబూసిన
గులాబీలు గుర్తురాకుండా
అన్నం సయించేదెట్లా
అని కూడా అన్నాడు.

నిన్న సాయంకాలం ఒక మిత్రుడు
ఈ రంజాన్ మాసపు సంధ్యవేళ
ఉపవాసదీక్ష ముగిస్తూ
నన్నూ తనతో విందుకి ఆహ్వానించేడు.

ఉపవసించడం ఒక ప్రార్థన
కాని ఉపవాస విరమణ
ఒక ధన్యవాద సమర్పణ
ప్రతి ఒక్క పారణ ఒక నివేదన.

అక్కడికి వెళ్ళాక తెలిసింది
అతడు భగవంతుడి పేరుమీద
తాను పిలిచిన ప్రతి ఒక్కరినీ
ఒక గులాబిమొక్కగా మార్చేసాదని.

(నిన్న సాయంకాలం ఖదీర్ బాబు ఇచ్చిన ఇఫ్తార్ విందు తలుచుకుంటూ)

28-3-2025

## ఏప్రిల్లో ఒక రోజు

వానాకాలంలో పొంగిపొర్లే ఏటిలాగా
ఉరకలెత్తుతున్న వసంతం.
నా కళ్ళముందే కొట్టుకుపోతున్నవి
కాలం, గగనం, నగరం.

ఇన్నేళ్ళ జీవితం తరువాత గ్రహించాను
రెండు దారులున్నాయని:
ఒకటి, నలుగురితో కలిసి నడిచే దారి,
మరొకటి పూలదారి.

ఏళ్ళమీదట అభ్యాసం చేసాక ఇప్పటికి
సాధ్యం చేసుకోగలిగాను
కోకిల పిలుపూ ఆకుల గలగలా తప్ప
మరొకటి వినబడని విద్య.

ఎవరిని చూడు: ప్రతి ఒక్కరూ ప్రపంచం
కైవసం కావాలనుకునేవారే.
నాది చాలా చిన్న కోరిక, స్వర్గం
కళ్ళకి చిక్కితే చాలనుకుంటాను.

పూసి, పూసినంతలోనే రాలిపోతున్నవి
పచ్చసుంకేసుల పూల రాశులు–

ఒక్కరోజు బతగ్గలిగినా చాలు నువ్వట్లా
ఈ వసంతం నీదని చెప్పుకోవచ్చు.

2-4-2025

## ఒక రోజంతా ఎండలో రగిలిపోయేక

ఒక రోజంతా ఎండలో రగిలిపోయేక
ఉన్నట్టుండి సాయంకాలానికి
గులాబీల గాలి వీచింది.

అప్పుడు ప్రతి ఒక్క మొక్క, చెట్టు, చిగురు
కొత్త ఉత్సాహం పీల్చుకున్నాయి
పెద్ద బాధ్యత ఒకటి నెరవేర్చాక
మనుషులు ఊపిరి పీల్చుకుంటారే, అట్లా.

ఎక్కడో ఎవరికో కలిగిన మంచితలపులాగా
గాలి ఇలా ఉదారంగా ఈ వీథిలోకీ ప్రవహించాక
ప్రతి ఒక్క గోడ, కిటికీ, కర్టెన్లు కూడా
కొత్తవిగా మారిపోయేయి.

చిరపరిచితమైన మనుషుల పట్ల
కొత్తగా కుతూహలం పుట్టే క్షణాలివి.
అప్పటిదాకా చదువుతున్న పుస్తకం పక్కనపెట్టేసినట్టు
ఇంతదాకా జీవించిన జీవితాన్ని
పక్కనపెట్టేవచ్చు.

ఇప్పటిదాకా రెండు ప్రపంచాలుగా ఉన్నవి
ఇకమీదట కూడా రెండుగా కొనసాగుతాయిగానీ

ఒక ప్రపంచాన్ని నేను సునాయాసంగా
మర్చిపోగలను.

అలాగని రెండో ప్రపంచం నా సొంతమైందనికాదు
కానీ నా చేతులకి ఇప్పుడొక
కొత్త వెలుగు దొరికింది
దాంతో నేనో గూడుకట్టుకోగలను.

5-4-2025

## వసంతమేఘగర్జన

చూస్తూ ఉండగానే ఆకాశమంతా మబ్బులు
చిక్కబడటం మొదలుపెడతాయి, ఇంటికి
అతిథులు రాబోతున్నారనగానే కుర్చీలు సర్దే
చప్పుళ్లతో పాటు బార్లా తెరిచిన తలుపులు.

అంతదాకా మామూలుగా ఉన్న వాతావరణంలో
ఇంకా ఎవరూ రాకుండానే ఎంతోమంది వచ్చినట్టు
ఒకటే హడావుడి. మరి కాసేపట్లో తెరతీస్తారనగా
నాటకం నడవకుండానే రసధార మొదలవుతుంది.

గార్డు ఊళ వేసిన తర్వాత కూడా ప్లాట్ఫారం మీద
ప్రయాణీకులు రైలెక్కడానికి జాగుచేసినట్టు
వీథుల్లో పిల్లలు క్రికెట్టు ఆడుతూనే ఉంటారు
ఇంతలో ఇంజను మోతపెట్టినట్టు కోకిల కూత.

అంతదాకా దిక్కుల్ని కలవరపెట్టిన అలజడి
చల్లబడుతుంది. ఆకాశం గుండె తెరిచిమరీ
స్వాగతం పలికినట్టు వసంతమేఘగర్జన.
ఆ వెనువెంటనే వీథంతా పుష్పవర్షం.

11-4-2025

## ఇప్పుడు మిగిలిన స్నేహాలు

నాకో ఉత్తరం రాసుకొచ్చి
నలుగురూ వినేలా
వీథిలోనే చదివి వినిపిస్తుంది
వసంతవాన.

ఇలా వచ్చినట్టే వచ్చి
ఉత్తరం చదివి వినిపించి
అలా వెళ్ళిపోయాక వీథుల్లో
దుమ్ము కూడా పరిమళిస్తుంది.

చూస్తున్నాను కదా
వసంత ఋతువు ప్రతిసారీ
నా మనసు తడిపి
సాంగత్యాల మరకలు తుడిచేస్తుంది.

అప్పుడు గానీ పలకరించదు
వీథి చివర దేవగన్నేరు.
లోకానికి నేను వీపు తిప్పేదాకా
కోకిల ఒకటే కంగారుపెడుతుంది.

ఆ ఉత్తరం సొంతం
అవి కూడా విన్నట్టే ఉంది.

ఇప్పుడు ఆ పిట్ట ఆ చెట్టు
మేం ముగ్గురం ఒక జట్టు.

15-4-2025

## హొకుసాయి తెలుసు కద!

హొకుసాయి తెలుసు కద! జపాను చిత్రకారుడు
బహుశా ఆ కెరటాల బొమ్మ చూస్తే గుర్తుపడతారు.

ఆ కెరటాల్ని అతడు ఏదో ఒక్కసారి కాదు
జీవితకాలం పాటు చిత్రిస్తూనే ఉన్నాడు.

ముప్పైమూడేళ్ళప్పుడు గీసిన బొమ్మలో
కెరటంకన్నా తీరం పెద్దదిగా కనిపిస్తుంది.

నలభైనాలుగేళ్ళప్పుడు గీసిన బొమ్మలో
కెరటాలమధ్య ఓడమీదనే ధ్యాసపెట్టాడు

మూడేళ్ళ తర్వాత మళ్ళీ గీసాడు
అప్పుడు కూడా కెరటాలున్నాయి, ఓడకూడా ఉంది.

డెబ్భై రెండేళ్ళకు మళ్ళా గీసాడు
ఇప్పుడు మరేమీ కనిపించవు, కెరటాలు, కెరటాలు తప్ప.

ఇరవయ్యేళ్ళ వయసులో కోకిలమీద రాసినప్పుడు
కాలం దేశం నన్నంటిపెట్టుకునే ఉన్నాయి.

నడివయసులో అడుగుపెట్టాక రాస్తే
కోకిలతో పాటు అడవీ కొండా వచ్చేశాయి.

ఇప్పుడు అరవై రెండేళ్ళ వయసులో
అడవిలేదుగాని అణచుకోలేని ఆవేదన ఉంది.

పదేళ్ళు వేచి చూస్తాను అప్పుడు రాయగలనేమో
కోకిల తప్ప మరేదీ కనిపించని కవితని.

19-4-2025

## సాయంకాలానికల్లా

సాయంకాలానికల్లా మేనెల
వీథుల్లోకి చేరుకుంటుంది.

చైత్రమాసపు చివరి పరిమళాలు
చెరిగిపోయిన వీథులు.

అప్పటికే కాలనీలో ఇళ్ళకీ ఇళ్ళకీ మధ్య
సగం జాగా కార్లే ఆక్రమించి ఉంటాయి.

మిగిలిన కొద్దిపాటి జాగాలోనూ
పిల్లలు క్రికెట్టు మొదలుపెడతారు.

ఒక బౌలింగుకీ మరొక బాటింగుకీ
మధ్య విరామంలో నా సాయంకాలం నడక.

మా మధ్యనుంచే ఒక ఎల్ బోర్డు కారు
దారి వెతుక్కుంటూ ఉంటుంది.

సాయంకాలం కాగానే ఆ దుమ్ములోనే
ఏదో ఒకటి వెతుక్కుంటూ ప్రతి ఒక్కరూ.

కొండలూ, అడవులూ కనుమరుగైన
హృదయంతో నేనేమి వెతుక్కోవాలి?

అయినా నడుస్తుంటానా, ఇంతలో
ఎక్కణ్ణుంచో వినిపిస్తుంది కోకిల కూత

తలెత్తి చూడబోతే నేనున్నచోటే
పెద్ద పార్కు కిందకి దిగుతుంది.

3-5-2025

# వేసవివాన వచ్చివెళ్ళాక

పొద్దున్నే వేసవివాన వచ్చివెళ్ళాక
వీథులొకపట్టాన మామూలు కాలేవు.

ప్రతి చెట్టుగుబురులోనూ
తేమగా ఒక నిశ్శబ్దం.

కొందరుంటారు– ఇలా వచ్చి
అలా వెళ్ళిపోతారు
వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ
మనలోంచి కొంత పట్టుకుపోతారు.

లేదా ఒక్కొక్కప్పుడు కొంత
ఇక్కడ వదిలిపెట్టి వెళ్ళిపోతారు.

వేసవివాన వచ్చివెళ్ళిపోయాక
కోకిల కూడా మూగదైపోతుంది.

ఇప్పుడు అదీనేనూ వెతుక్కుంటున్నాం
వదిలిపెట్టిందేదో, వెంట తీసుకుపోయిందేదో.

15-5-2025

# నగరం పుట్టకముందు నగరం

నడివేసవి వెన్నెల రాత్రి.
హటాత్తుగా పెద్దవర్షం.
కరెంటుపోయింది. నగరానికి
అడవి దగ్గరగా జరిగేదిలాంటప్పుడే.

ఎవరూ గుర్తుపట్టకుండానే ఆ చీకట్లో
పెద్ద ఊరేగింపు వెళ్ళిపోయిన నిశ్శబ్దం.
కిటికీ తెరలు పక్కకి తప్పించి చూస్తే
ఇంకా పూర్తిగా పిండకుండానే ఆరేసినవెలుగు.

కిటికీ లోంచి వీస్తున్న గాలిలో
నా చిన్నప్పటి పాలపూల పరిమళం
దాని వెన్నంటే ఒక చిమ్మెట
వెలుతురు కూనిరాగం.

అయితే పట్టపగలు, లేదా విద్యుద్దీపాల మధ్య
ఎన్నిసార్లు ఎన్నిచోట్ల ఎందరితో
ఈ నగరంలో నేను తిరుగాడలేదు!
అయినా ఎందుకో ఈ ఊరు నాకు అంతుబట్టదు.

ఆ రాత్రి మసకవెన్నెల కిటికీలోంచి
కనబడుతున్నది మటుకు బాగా తెలిసినట్టుంది.

అది ఈ నగరం పుట్టకముందు నగరమని
పోల్చుకోడం నాకేమంత కష్టం కాలేదు.

19-5-2025

## వసంతఋతువు చివరిరంగు

వసంతఋతువు చివరిరంగు దిగులు
సౌగంధిక పర్వంలో ఇది చివరి పద్యం.

వసంతం నడివేసవిగా మారిపోయేక
మదిలోపల కూడా ఎండ కాస్తుంటుంది.

ఆ పరాగమూ ఆ తేనే తరలిపోయాక
ఎటు చూడు దుమ్మునిండా పూలమరకలు.

మధుమాసమంటే అప్పుడు అడవులూ కొండలూ
ఇప్పుడు రెండున్నరవీథుల ఈవెనింగ్ వాక్.

ఆ పసుపుపూల చెట్టుని చూసుకుని కదా
ఈ ప్రపంచాన్ని పక్కకు నెట్టేగలిగావు.

రాలిపడుతున్న పూలరేకలు పలచబడుతున్నచోట
ఒక  సంభాషణ ముగిసిపోతున్న చివరి క్షణాలు.

కానీ రాలిపడుతున్న పూలరేకల్ని చూసినప్పుడల్లా
నీలో ఒక పువ్వు మొగ్గ తొడుగుతూనే ఉంటుంది.

27-5-2025

# ఆ ఉత్తరంలో

ఆ ఉత్తరంలో రెండుపేజీలు చదివానో లేదో
మధ్యలో ఖాళీకాగితంలాగా గ్రీష్మ ఋతువు.

రంగుపోగొట్టుకున్న అక్షరాలు, దానిమీద
ఒక వానజల్లు పడితే తప్ప తేటపడవు.

మూలభాషకి దూరంగా జరిగిన అనువాదంలాగా
ఈ నగరం, ఈ వీథులు, ఇక్కడి దైనందిన జీవితం

ఒక పురాణపాత్రలాగా జీవించాను మొన్నటిదాకా
ఆరునెలలు పాతాళంలో, ఆరునెలలు భూమ్మీదా.

నెమ్మదిగా తెలుస్తున్నది, నేను నడుస్తున్నదారి
ఏకకాలంలో కంటక వికీర్ణం, కుసుమ విశీర్ణం.

స్నేహితులుంటే ఉత్తరాలు రాసిఉండేవాణ్ణి, ఇప్పుడు
లోకంతో మాట్లాడాలంటే కవిత ఒక్కటే దారి.

మండుటెండల్లో తురాయిచెట్టు నేర్పిన పాఠమిది:
నీ గుండె బద్దలయిందా! దారంతా పూలు చిమ్మాలి.

4-6-2025

# మంత్రమయపవనం

ఇంకా తెల్లవారకుండానే తలుపు తెరిచి చూస్తే-
బాల్కనీలో గులాబిమొక్కల్ని లాలిస్తున్న గాలి.

తల్లికడుపులో దూరిమరీ పడుకున్న కుక్కపిల్లల్లాగా
గాలి చేతుల్లో ఒదిగి కనులరమోడ్చిన మొగ్గలు.

ఊయెల్లో కనులరమోడ్చి తన తలపుల్లో తేలియాడే
బిడ్డను నలుగురికీ పిలిచి మరీ చూపించే తల్లిలా-

ఆ మొక్కల దగ్గరికి అయితే సమస్త ప్రపంచంతోనో
లేదా నేనొక్కణ్ణే పోయి నిలబడాలని తెలుస్తున్నది.

ఎక్కడో దూరంగా నడుస్తున్న సంకీర్తన నెమ్మదిగా
నీ ఇంటిదిక్కు మళ్ళినట్టు మరికాసేపట్లో ప్రభాతం.

అడవి వార కొండవాగులో పాదాలు మోపగానే
ఓషధులు నీ పాదాల్ని చుట్టుకున్నట్టు ఒక ధన్యత.

నా పసితనాన పిల్లలం మాకు బాగోలేదన్నప్పుడల్లా
మా అమ్మ ఒకామెతో మాకు మంత్రం వేయించేది.

కావిరంగుచీర కొంగు, నుదుటన తిరుచూర్ణం,
ఆ వైద్యురాలి దగ్గర ఏదో పురాతన గృహాల వాసన.

పొయ్యి రగిలించడానికి పొగగొట్టం ఊదినట్టు
ఆమె నోరు సున్నాలాగా చుట్టి గాలి ఊదేది.

నా మొహంలో మొహం పెట్టి పైకీ కిందకీ ఆమె
ఊదినంతసేపు గాలి ఊదాక ప్రాణం తేలికపడేది.

ముణగదీసుకు పడుకున్న ఈ కుక్కపిల్లల చుట్టూ
ప్రత్యూషపవనం లాలనగా జపిస్తున్న మంత్రం.

పూలమొగ్గలకు స్వస్థత. పూల మొక్కలకు స్వస్థత.
ఆ క్షణాల్లో అక్కడున్నందుకు నాక్కూడా స్వస్థత.

15-6-2025

## అక్కర్లేని చుట్టం

ఒక వానపడుతూనే నగరవీథులు మెత్తబడిపోతాయి
ఎంత మహానగరమూ ఇట్టే నిస్సహాయమైపోతుంది.

వానంటే పల్లెల్లో పొలాలు, పనులు, ఊడ్పులు
వానపడుతుంటే నగరానికేం చెయ్యాలో తెలియదు.

వానొస్తూనే పల్లెల్లో తలుపులన్నీ బార్లా తెరిచేస్తుంది
నగరంలో వానొస్తూనే కిటికీలన్నీ మూసేస్తుంది.

వానొచ్చిందంటే చాలు పల్లె కరిగి ప్రవహిస్తుంది.
నగరం ఉన్నచోటే ముడుచుకుపోతుంది.

గ్రామాల్లో వాన ఒక మెలకువ, వేకువ, ఒక వేడుక
నగరాల్లో వాన ఒక ఇబ్బంది, ఇరుకు, మురికి.

పల్లెల్లో వాన ఒక పాట, పిల్లలాడుకోడానికొక ఆట
నగరాల్లో వాన అక్కరకు రాని చుట్టం, అక్కర్లేని చుట్టం.

7-8-2025

## ఇప్పుడు నాక్కూడా అనుభవం

ఒకరాత్రివేళ ఏదో సవ్వడి వినబడి బాల్కనీలోకి వచ్చి చూస్తే
వీథిలో ఒక్కర్తీ నా చిన్నప్పటి భాషలో మాట్లాడుతున్నది వాన.

పొలాలని ఫలాలుగా మార్చే మాటలవి. కాయలు పండ్లుగా
మారేదెన్నడని తలపోస్తూ మిగిలిన రాత్రంతా గడిపేను.

ఇన్నాళ్ళూ కాయని కాయగా, పండుని పండుగా చూసాను
కాయగా బతుకుతూ ఒకనాటికి పండుగా మారాలనుకున్నాను.

హటాత్తుగా స్ఫురించింది, కాయలే నెమ్మదిగా పండ్లవుతాయని-
ఎన్నో రాత్రులపాటు మగ్గుతూ మగ్గుతూ మధురమవుతాయని.

కాయలోంచి వగరూ పులుపూ ఒక్కొక్కటీ తొలగిపోయే క్షణాలు-
అబ్బా! అది చెప్పలేని పెనగులాట. చెప్పుకోలేని నలుగులాట.

కాయ పండుతున్నప్పుడు అదొక వరదలాగా ముంచెత్తుతుందా?
లేక తెల్లవారే వెలుగులాగా, పూలలో రంగులాగా వ్యాపిస్తుందా?

ఒక్కటి మాత్రం చెప్పగలను. చేదు విరిగినప్పుడే జీవితం సఫలం.
యుగాలుగా చెట్లకి తెలిసిన సంగతి ఇప్పుడు నాక్కూడా అనుభవం.

11-8-2025

## ఇప్పటికి తెలిసింది

ఇన్నాళ్ళూ ప్రతిరోజూ
దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉన్నాను
నిత్యం నా కష్టసుఖాలు
చెప్పుకుంటూ వచ్చాను.

ఇప్పటికి తెలిసింది.

నేను చేయవలసిందల్లా
ప్రతి ఒక్క పూటా
ఆయన ముందు మోకరిల్లి–

ధన్యవాదాలు ధన్యవాదాలు
ధన్యవాదాలు చెప్పుకోవడమే.

13-8-2025

## వానపడ్డ రాత్రి

ఎప్పుడొచ్చాయో తెలీదు, ఒకరాత్రివేళ
బాల్కనీలో, పోర్టికోలో, పచ్చిగడ్డివాసనతో
ఆవుల మందలు.

కొమ్ములమీద, చెవులమీద వెలుగుతునకలు
చిన్ని చిన్ని దీపాల్లాంటి కళ్ళ చుట్టూ
ధారలుకట్టిన మెరుపులు.

వానపడ్డ రాత్రి చేలల్లో నీళ్ళతో
సహా నగరంలోకి గ్రామం కొట్టుకొచ్చింది.
నగరం కొట్టుకుపోయింది.

వానాకాలం మొదలయ్యింది, దారులు
చెరిగిపోయాయి, రథాలు కదలవు, మనో
రథాలే దిక్కన్నాడు పూర్వకవి.

పసులమందల చిత్తడిలో,
వానపడ్డ రాత్రి, పాతదారులు చెదిరిపోయి
కొత్తదారులు తెరుచుకున్నాయి.

28-8-2025

## వానలు పడుతున్నంతసేపూ

వానలు పడుతున్నంతసేపూ
పడవలు వచ్చి ఆగుతుంటాయి.
వెయ్యి తలుపులు ఒక్కసారి
తెరుచుకున్నట్టు వేలాది పడవలు.

వానపడుతున్నంతసేపూ
కిటికీలోంచి బయటకి చూస్తుంటాను
ఎక్కడెక్కడి పడవలూ నా ఇంటివాకిట్లో
ఉత్తరాలు కుమ్మరించిపోతాయి.

ఇప్పుడా మహారణ్యాల్లేవు, ఆ కొండలు దూరం,
వానలు మాత్రం నా ఇంటిదాకా వస్తాయి
ఆ నది ఒడ్డున రెల్లువిరబూసిందని
చెప్పడానికి నన్ను వెతుక్కుంటూ వస్తాయి.

లోకం ఏ వార్తలు కోరుకుంటుందోగాని
నేనీ వార్తలకోసమే పరితపిస్తాను.
కిటికీ లోంచి వాన గాలి తగలగానే
రెల్లు పొదల మాటలు వినబడతాయి.

కాకినాడలో ఉప్పుటేరుదగ్గర పడవలు
వరసగా నిలిచి ఉండే దృశ్యం గుర్తొస్తోంది.

కటు క్షారమయ జగత్తు, జీవితం మధ్యనే
రెల్లు పూసే కాలం నావలాగా తేలి వస్తుంది.

21-9-2025

## భగవంతుడి చేతులు

ఈ రోజులెప్పటికీ ముగిసిపోవన్నంత సంతోషంతో
ఎవరి చేతులు పట్టుకు
కరచాలనాలు చేసానో
ఒప్పులకుప్పలాడానో
ఈ రోజులెప్పటికీ ముగిసిపోకూడదనుకుంటూ
ఎవరి చేతులు పట్టుకు నడిచానో
నా సమస్త భద్రత పక్కనపెట్టి
ఎవరికి బాసటగా నిలబడ్డానో
ఎవరి చేతులకు నా చేతులడ్డుపెట్టి
కాపు కాచానో
ఆ చేతులు కనబడవు.

అగాధంలోకి జారిపోతున్నప్పుడు
కొనప్రాణం అరచేతుల్లోకి తెచ్చుకుని
అంచులు పట్టుకు వేళ్ళాడుతూ
ఆక్రోశిస్తుంటే
అదేమిటో ఆ చేతులు కనబడవు.

కాని సరిగ్గా అప్పుడే
ఈ చేతులు చూసాను.
కంచెమీద పాకుతున్న
లేత నులితీగల చిటికెనవేళ్ళు పట్టుకుని

ఓపిగ్గా ఒద్దిగ్గా
కంచెమీదకెక్కించే చేతులు
కూలిపోతున్నానని కుమిలిపోయే క్షణాల్లో
కరుణించే చేతులు.

అవి నాకింతదాకా తెలిసినవారి చేతులు కావు
స్నేహితుల చేతులు కావు
బంధువుల చేతులు కావు
నా వల్ల ఉపకారం పొందిన చేతులు కావు
నాతో చెట్టపట్టాలు పట్టుకు నడిచినవి కావు

కాని ఈ చేతులు నాకు తెలుసని
ఇప్పుడు తెలుస్తోంది
అమ్మ కడుపులో ఉన్నప్పణ్ణుంచీ
చుట్టూ పెట్టనికోటలాగా
కాచి కనిపెట్టుకున్న చేతులు.

భగవంతుడి చేతులు.

27-9-2025

# కవిత్వం రాసుకోవడం

కవిత్వం రాసుకోవడం
ఒక ప్రథమ చికిత్స.

జీవితం గాయపరిచినప్పుడల్లా
ఏదో ఒకటి చేసి
ముందు రక్తం కారకుండా చూసుకోడం.
నొప్పినయితే ఎలానో భరిస్తాంగాని
ఏదో ఒకటి చెయ్యకుండా ఉండిపోయామన్న
చింత లేకుండా చేసుకోడం.

కవిత్వం చదువుకుంటూ ఉండటం
ఒక కాయకల్ప చికిత్స.

లోపల రక్తం శుద్ధిపరుచుకోవడం
రోగనిరోధక శక్తి పెంచుకోవడం
వచ్చే వృద్ధాప్యం ఎలానూ ఆగదుగాని
జీవితోత్సాహం చెక్కుచెదరకపోవడం.

కవిత్వం సంభావించుకుంటూ ఉండటం
ఒక సంజీవకరణి.

కూలిపోయామనుకున్న
ప్రతి ఒక్క క్షణం

మళ్ళా కొత్తగా లేపి
నిలబెడుతూనే ఉంటుంది.

8-10-2025

## నీడల్లేని కాలం

ఆషాఢ మాసపు అపరాహ్ణాల్లో
కొండలమీద పరుచుకునే మేఘాలనీడలు
సాయంకాలపు గోధూళిమధ్య
ఊరంతా ముంచెత్తే అంబారవాల నీడలు
గ్రామాలకింకా కరెంటు రాని రోజుల్లో
వెన్నెలరాత్రుల వెచ్చని నీడలు-
అదొక కాలం.

ఒకరిమీద ఒకరు ఒరిగిపడుతూ
కిక్కిరిసిన నీడలు
ఇళ్ళూ, గదులూ, తెరలూ
బంధాలూ, బాహువులూ
స్నేహాలూ, వైరాలూ కలగలిసిపోయి
ఊపిరాడనివ్వని నీడలు
అదొక లోకం-

ఆ కాలం గూడా గడిచింది.
లోపలా బయటా అని వేరుచెయ్యలేని ఒక తావుకి చేరుకున్నాను.
నాకు నేనే ఒక దీపం కనుక నీడలు కూడా లేవు.

ఇప్పుడు నడుస్తున్న కాలమిది.

29-10-2025

## చాలా రోజులుగా

చాలా రోజులుగా మనసులో
ఒక వాక్యం మెదుల్తోంది-
ఈ లోకం ఒక నీడ అని.

అందుకనే కాబోలు
అది నన్ను చేరదీసుకున్నా
నేను దాని చెంతకు చేరినా
ఇట్టే జారిపోతుంది.

చూడవలసిందీ
చేరవలసిందీ
వెలుగుని-
నీడని కాదు.

26-11-2025

# నేను కోరుకునేదొక్కటే

అడిగారట ఒకప్పుడొకాయన్ని
సూఫీల గురించి చెప్పమని.[1]

ఆయనన్నాడట:
మొదట్లో వాళ్ళీ ప్రపంచంలో కుదురుకోలేకపోయారు
కాని మనసులో నిశ్చలంగా ఉండేవారు.
తర్వాత తర్వాత ప్రపంచంతో సర్దుకున్నారు
కాని మనసులో అశాంతిపడుతుండేవారని.

భగవంతుడా!
నేను కోరుకునేదొక్కటే
నాకు ప్రపంచమంటూ
మరొకటి లేకుండా చూడు!

11-12-2025

---

1.Sadi, Gulistan, Darvishan, story no.25

## ఈ కాలమే అలాంటిది

మొత్తం లెక్కపెట్టాను. పందొమ్మిది.
నాసరరెడ్డి పందొమ్మిది కవితల్లాగా
పందొమ్మిది  గులాబి మొక్కలు.

మొక్కలచుట్టూ గడ్డకట్టిపోయిన మట్టి–
గాలిచొరబడాలంటే గుల్లబరచాలి.
నా చేతివేళ్ళు వానపాములై ఉండాల్సింది.

డిసెంబరు గులాబీల మాసం కాదు
అయినా ఈ మట్టిలో ఈ మొక్కల వేళ్ళు
నిద్రపోటం లేదని గుర్తుపట్టాను.

ఇవి కూడా మార్గశిరాన్ని పిలుస్తున్నాయి
మంచుని ధిక్కరించి చేతులు ఎగజాపి
పూలై తలెత్తాలని వీటికెంత ఆరాటం!

ఈ కాలమే అలాంటిది. ఇప్పుడు నువ్వు కూడా
నీ రోజువారీ ఇంద్రియాల్ని విడిచిపెట్టి
వ్యోమగాముల దేహం ధరించక తప్పదు.

15-12-2025

## ఉత్తర ద్వారం

ఈ కాలమంతా
ఒక తలుపు తెరుచుకుంటూనే ఉంటుంది
అది కనబడేది కాదు
వినబడేది.

తల పైకెత్తి చూడు
ఆకాశమంతా
తలుపులు బార్లా తెరుచుకుంటున్న
నీలలోహిత ప్రకంపన.

ముంచెత్తే ఆ మందాకినిలో
మునిగి తేలకుండా
నువ్వు గుడికి వెళ్ళి ఏం లాభం?

తెరుచుకుంటున్న ఆ తలుపులు తీసి
నీలోకి నువ్వు అడుగుపెట్టావా
నీ ఇల్లే గుడిగా మారిపోతుంది.

30-12-2025

## మధువిద్య

నీ ఇంటికొచ్చినవారిచేతుల్లో
ఈ పూట ఒక పూలగుత్తి పెట్టు.

అవును, కాలానికి ఎదురేగినవారే
కాలానికి ఎదురీదినవారు.

అనుభవించడానికో
ఆస్వాదించడానికో అయితే
నాకు జీవితం పట్ల మోహం లేదు.

అయినా బతకాలనిపిస్తుంది–
మరింత తెలుసుకోడానికి
మరింత నేర్చుకోడానికి
మరింత పంచుకోడానికి.

ఇదొక మధువిద్య.
జీవించినంత కాలం
ఒక మధువిద్యార్థిగాజీవించాలి.

అలాగని
ఒక్కొక్క తేనెబొట్టూ తెచ్చుకుని
కట్టుకున్న గూటిలో
నేనుంటాననా?

ఆ మధుకోశం ఎవరి చేతికందినా
ఆ మధుసించితాధరాల మీద
నా తదుపరిజీవితం కొనసాగుతుంది.

31-12-2025

# ఇంతకన్నా మరేం కావాలి?

(తెలుగు వెంకటేష్ కి, కర్నూల్లో ఒక ఫుట్ పాత్ మీద, సెకండ్‌హేండు పుస్తకాల మధ్య, నా నీటిరంగుల చిత్రం కవిత్వం దొరికిందని విన్నప్పుడు)

ఇంతకన్నా మరేం కావాలి?
నాకు బతికుండగానే
అమరత్వం సిద్ధించింది.

6-1-2026

## పరుసవేది

ఆ పసుపుపూలచెట్టు
నిండుగా వికసించిందని చెప్పవచ్చు.
కాని అది నా చుట్టూ
సృష్టిస్తున్న ప్రకంపనల్ని
పూర్తిగా వివరించినట్టు కాదు.

అది అడ్డగిస్తున్నది, తానేది కాదో
ఆ ప్రతి ఒక్కదాన్నీ నిరోధిస్తున్నది
తనున్నంతమేరా మరేదీ వ్యాపించకుండా
ఒక రాజ్యం సాగిస్తున్నది.

ఆ చెట్టు స్థిరంగా నిలబడిందనుకోవచ్చు.
కాదు, అది అనుక్షణం చలిస్తున్నది.
రోజూ కొంతసేపేనా ఆ జ్వాల
నన్ను తనలోకి లాక్కుంటున్నది.

నేను నడుస్తున్నాననీ
ఆ చెట్టు ఉన్నచోటనే
నిశ్చలంగా నిలబడిందనీ అనుకోవచ్చు
కానీ దాని వేళ్ళు నా రోజువారీ జీవితం కిందకీ
చొచ్చుకొస్తున్నవి.

ఆ కొమ్మల్లో, ఈనెల్లో, పూలరేకల్లో
సూర్యకాంతి వర్షించినప్పుడల్లా
నాలోపలకీ ఏదో ప్రసరిస్తున్నది.

మట్టిని బంగారంగా మార్చడమెలానో
ఆ చెట్టుకి తెలుసని చెప్పవచ్చు
కానీ అది తన చూపరిని కూడా
బంగారంగా మార్చగలదని
ఇప్పుడే తెలుస్తున్నది.

13-1-2026

## సంక్రాంతి

రోజూ చూస్తుంటాను
స్విగ్గీలు, బ్లింకిట్లు, జెప్టోలు, జొమేటోలు
ఈ నగరాన్ని
తమ భుజాల మీద మోస్తుంటాయి.

రాపిడోలో, ఊబర్లలో
ప్రతి రోజూ నల్గొండ
ఈ నగరాన్ని నడిపిస్తుంటుంది.

పాలమూరు ప్రతిరోజూ ఈ నగరాన్ని
తుడిచి శుభ్రం చేసి కడిగి బోర్లిస్తుంది.
ఒరిస్సా వీథులూడుస్తుంది
బీహారు సపర్యలు చేస్తుంది.

కాని ఈ ఒక్కరోజు కథ వేరే.
ఇవాళ నగరాన్ని గాలిపటాలు ఎగరేసుకుపోతున్నాయి
తొలిమామిడిపూతగాలి గుండెనిండుగా పీల్చుకుని
నగరం ఈ ఒక్క రోజుకి
పల్లెగా మారిపోయింది.

14-1-2026

## గాలిపటాలు పూసేకాలం

భాద్రపదం చివరి దినాల్లో రెల్లు పూసినట్టు
మలి హేమంతంలో గాలిపటాలు పూస్తున్నాయి.

ఆకాశమంతా విరబూసిన పూలతోటల్లోంచి
రాలిపడ్డ రేకల్తో ప్రతిచెట్టూ ఒక పూలమొక్క.

వీథుల్లో పిల్లలు దారం కొసలుపట్టుకుని
పడవలు నడుపుకుంటూ పోతున్నారు పైపైకి.

ప్రపంచం మీద యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నవి
కానీ పిల్లల గగనతలమ్మీద సంతోషానిదే రాజ్యం.

వాళ్ళు గాలిపటాలు ఎగరేస్తున్నారనుకుందామా
ఆకాశం తలుపులు ఒకటొకటీ తెరుస్తున్నారు.

స్వర్గానికి నిచ్చెనలు కట్టుకుంటున్న పిల్లలవెనక
ఇప్పుడు నగరం కూడా నింగిబాట పట్టింది.

16-1-2026

# కవిత పూర్తవుతుంది

హేమంత ఋతుసంధ్యాసమయాన
ధూపం వేసినట్టు మామిడిపూత.

రోజూ నడిచే వీథుల్లోనే ఈసారి
కలలో నడిచినట్టు నడుస్తాను.

దినమల్లా పాటలు పాడిన గొబ్బిపూలు
దినాంతానికి మూగబోతాయి.

ఆదివారం పూట పార్కు చేసిన కార్లు
ఆకులు రాలిన చెట్లలాగా ఉంటాయి.

చప్పుడు చెయ్యకుండా ప్రవహించే
సంజకాంతిలో గాలం వేసి కూచుంటాను.

ఆ వేళప్పుడు నాతో పాటు నా పక్కనే
మరొకరు కూచున్నట్టు తెలుస్తుంటుంది.

నా శబ్దాన్ని వారికిచ్చి వారి నిశ్శబ్దం
నేను తీసుకోడంతో కవిత పూర్తవుతుంది.

19-1-2026

## రెండో చరణం

నిండుగా పూసిన ప్రతి మామిడి చెట్టూ
నేను పోగొట్టుకున్నది
నిజంగా పోగొట్టుకోలేదనే చెప్తుంది.

మాఘమాసం రాగానే
కిందటేడాది ఎక్కడ వదిలిపెట్టానో
ఆ కవితలక్కడే కనిపిస్తాయి.

మునుపెన్నడో ఒక కథలో చదివామే
గంగానదిలో ఒక కంకణం పోగొట్టుకున్న చోటనే
రెండో కంకణం కూడా దొరికినట్టు
అప్పుడు సగంలో ఆగిపోయిన చరణానికి
ఇప్పుడు రెండో చరణం తోడై దొరుకుతుంది.

1-2-2026

## మాఘపురాణం

మాఘమాసపు మధ్యాహ్నం.
నదికి ఆవలా ఈవలా
పొదల్లో పొలాల్లో తోటల్లో
తలుపులన్నీ బార్లా తెరిచిపెట్టారు.

నా చిన్నప్పుడు మా ఊళ్ళో
ఈ వేళప్పుడు ఊరు
మాగన్నుగా కునుకు తీసేది

పనిపాటలు ముగించుకుని
మా అమ్మ ఆ మట్టి అరుగుమీద
మేను వాల్చి గడపకు తలానించి
కళ్ళు మూసుకునేది.

అప్పటికింకా పసికూననేగాని
నాకు చదవడం బాగా వచ్చేది.
ఆ మధ్యాహ్నాలు భక్తవిజయమో
మరొకటో చదివి వినిపించుకునేది.

ఇప్పుడు నేనిట్లా ఈ ఒడ్డున
వెల్లకిలా పడుకున్నాను.

ఇప్పుడు నది నాకు
మాఘపురాణం వినిపిస్తున్నది.

2-2-2026

## సహశయానులు

(పాతబస్తీలో ఉస్తాద్ బడే గులాం ఆలీఖాన్ సమాధిని సందర్శించినప్పుడు)

ఆ గానం వింటూనే ఉన్నారు రసజ్ఞులంతా
వింటూ మైమరుస్తూనే ఉన్నారు.
ఇప్పుడాయన వారి మధ్య లేడు,
కాని ఆ పాటలున్నాయి.

తన మృణ్మయమందిరంలో శయనించి
ఇక్కడ కూడా పాడుతూనే ఉన్నాడాయన
చూడబోతే ఈ ఆడిటోరియం
ఇరవైనాలుగ్గంటలూ తెరిచినట్టే ఉంది.

ఆయన  సహశయానులు కూడా
నిద్రపోడం మరిచినట్టే ఉన్నారు.
ఇప్పుడు వీరిమధ్య ఆయనా ఉన్నాడు
ఆయన పాటలూ ఉన్నాయి.

4-2-2026

## కిరణజన్య సంయోగక్రియ

గాలి పీలుస్తూ బతుకుతూనే నువ్వొక
నాటికి కాంతిపీల్చుకుంటే తప్ప
బతకలేని స్థితికి చేరతావు. అప్పుడు
నీకు వెలుగుతప్ప మరేదీ రుచించదు.

చెట్లు చూడు: మొదట్లో నీళ్ళ కోసం
లోపలకీ ప్రయాణిస్తాయి. తమలోకి
కుదురుకున్నాక, వెయ్యి చేతులు చాచి
వెలుగు పీల్చుకోడం మొదలుపెడతాయి.

అలాంటి కిరణజన్య సంయోగక్రియ నీలో
మొదలవగానే అన్నిటికన్నా ముందు నీ
కలలు తేటపడతాయి. అప్పుడు పొద్దున్నే
పక్కమీంచి లేవడమే పద్మంగా మేల్కొంటావు.

9-2-2026

## నేనూ ఇంతే కద!

పండుగుమ్మడికాయమీద
పరుచుకున్న పూతలా
ఫిబ్రవరి సూర్యకాంతిమీద
పలచని మంచుపొర.

ఇప్పుడు చెట్లు తమని తాము
రిక్తం చేసుకునే కాలం.
ఒకప్పుడు పూలు విరజిమ్మినట్టు
ఇప్పుడు ఆకులు రాలుతున్నాయి.

నేనూ ఇంతే కద!
ఒకప్పుడు గుండెబరువెక్కి
కవితలు రాసుకునేవాణ్ణి.
ఇప్పుడు! మనసు తేలికపడి.

12-2-2026

## జుగల్‌బందీ

(నిన్న సాయంకాలం సుర్‌మండల్ వారు ఏర్పాటు చేసిన ఉత్తర్-దక్షిణ్ సంగీత సమారోహంలో జయతీర్థ్ మేవుండి, శశాంక్ సుబ్రహ్మణ్యంల జుగల్‌బందీ విన్నాక)

మొదట వారిద్దరూ
ఒక సరసు ఒడ్డున కనిపించారు
నీలి సరోవరంలో
అకుపచ్చనీడలమధ్య
లలితంగా అడుగులేస్తున్న
గాలిపాదాల చుట్టూ కాంతివలయాలు-

ఆ మెత్తని అడుగుల చప్పుడు
కన్నార్పకుండా చూస్తుండిపోయారు
వారిద్దరూ-

కొంతసేపు.

ఇంతలో తమనెవరో
పరిమళపు నెమలీకతో తాకగానే
ఏదో గుర్తొచ్చినట్టు లేచి
ఒక జలపాతం బాటపట్టారు.

ఆ జలపాతం కిందనిలబడ్డాక
వారి సంచలనం ఏమని చెప్పను!

తమమీంచి ప్రవహించిపోతున్న
నిర్విరామజలధారల్ని
ఒళ్ళంతా బాహువులై మరీ
బంధించాలని చూసారు
అక్కడ ఎవరుంటే వారిమీద
ఇన్ని నీళ్ళు చిలకరిస్తూనే ఉన్నారు.

ఇప్పుడు వారొక సముద్రం
ముంగిట నిలుచున్నారు.
జీవనవ్రత సాఫల్యసూచక శంఖధ్వనిలాగా
సంధ్యకాంతి.

అప్పుడు తమ పూర్వీకులు తమకి
ధారాదత్తం చేసిందంతా
ఇన్నేళ్ళుగా తాము కూడబెట్టుకున్నదంతా
అక్కడెవరుంటే వారికి పంచేశారు.

కచేరీ పూర్తయిందన్నారెవరో
కానీ వారిద్దరూ ఎక్కడ?
అంతదాకా అక్కడ ఉన్నవారెక్కడ!

15-2-2026

## ఈ ఊరు వదిలి, ఈ వీథివదిలి

రెండు వేల చదరపు కిలోమీటర్ల
నగరంలో రెండున్నర వీథులు:
ఒక మానవమహేతిహాసంలో
నేను పునః పునః పఠించేదింతే.

సూర్యరథచక్రపు అంచు ఈ వీథికి
రాచుకున్నప్పుడల్లా ఒక గలగల.
రాలిపడుతున్న ప్రతి ఒక్క ఎండుటాకూ
గతాన్నెలా వదిలి పెట్టాలో చెప్తుంది.

మొన్న పారిజాతాలు, నిన్న డిసెంబరాలు
నేడు ఫాల్గుణ మాసపు వెన్నెల-
సగం జీవితం మట్టిగా మారిపోతుండగా
మిగిలిన సగం పరిమళతుల్యం.

ఇన్నాళ్ళూ తలపులు సంకల్పాలుగా
మారే తావుల్లో నన్ను నేను
నిగ్రహించుకుంటూ, ఓడిపోతూ
స్వర్గనరకాల మధ్య ఊగిసలాడేను.

ఇప్పటికి తెలిసింది: తలపులు పుట్టే
తావుకన్నా ముందొక తావుంటుందని.

ఈ ఊరు వదిలి, ఈ వీథివదిలి
నెమ్మదిగా అటువైపు అడుగులేస్తున్నాను.

26-2-2026

## ఈ చెట్టు

And since to look at things in bloom
Fifty springs are little room, ..

A.E (Loveliest of trees, the cherry now)

బ్రెహ్టానా అన్నాడు: ఎలాంటి కాలమిది
ఇప్పుడు చెట్ల గురించి మాట్లాడటం నేరం
ఎందుకంటే ఆ వంకన
మనుషులకి జరుగుతున్న అన్యాయాల గురించి
మాట్లాడకుండా తప్పించుకుంటున్నావు-
అనే కదా!

కానీ, ఇప్పుడు నేను ఈ చెట్టు గురించి
మాట్లాడకపోవడం కన్నా మించిన
నేరం మరేదీ ఉండదు.

ప్రపంచం మొత్తం కలిసికట్టుగా
నన్ను చీకట్లోకి నెడుతున్న ఈ కాలంలో
ఈ చెట్టు ఒక్కటే నా పక్కన నిలబడుతున్నది.

జానపదకథల్లో మైదాసులాగా
ఇప్పుడు ఒక చూపు, మాట, తలపు కూడా

మారణాయుధంగా మారిపోతున్న రోజుల్లో
ఈ చెట్టు ఒక్కటే
తనని ఎవరు చూస్తే వాళ్ళని
బంగారంగా మారుస్తున్నది.

జపానువాడు చెర్రీపూలకోసం
ఏడాది పొడుగునా వేచివున్నట్టు
ఫాల్గుణమాసపు ఈ కానుగ చెట్టు కోసం
నేను కూడా ఎదురు చూడగలను.

నేను సాష్టాంగపడకుండానే
నన్ను దీవిస్తున్న ఈ చెట్టుముందు
మరో యాభయ్యేళ్ళు బతికినా
తక్కువనే అనిపిస్తున్నది.

6-3-2026

## సాధారణంగా చెట్లు

సాధారణంగా చెట్లు పీల్చుకుంటాయి
చిన్నప్పుడు వేలు తెగి నెత్తురొస్తున్నప్పుడు
మీ అమ్మట్లానే ఆ వేలు నోట్లో పెట్టుకుని
పీల్చేసిందే, అలా నీ నొప్పి పీల్చేస్తాయి.

అప్పుడు నువ్వు అంతా మర్చిపోయి అసలేమీ
జరగనట్టే మళ్ళా ఆటల్లో పడిపోయావు చూడు,
అలా చెట్లు చెరిపేస్తాయి, ఇంటికొచ్చేటప్పటికి
నీ హోం వర్కంతా ఎవరో చేసేసుంటారు.

సగం చదివి బల్లమీద అలానే వదిలిపెట్టేసిన
పుస్తకంలాగా, చెట్లలానే ఉంటాయి, మళ్ళా
తెరిచే లోపు గాలికి పేజీలు కలిసిపోతాయి
కాని ఫాల్గుణం చేవ్రాలు మిగిలిపోతుంది.

10-3-2026

## కానుగచెట్టు దినచర్య

చంద్రుడిపైన సూర్యకాంతి పడితే వెన్నెలగా
మారుతుందని విన్నాను. ఫాల్గుణమాసపు
కానుగచెట్లపైన సూర్యకాంతి పగలే
వెన్నెలగా మారడం కళ్ళారా చూస్తున్నాను.

నిండుగా వికసించిన ఒక పసుపుపూలచెట్టుని
చూసి ఒకప్పుడు నా ఆశ్చర్యం ఆగలేదు
అది ప్రతి ఒక్కదాన్నీ నిరోధించడం చూసాను,
సౌందర్యరహిత ప్రపంచాన్ని పక్కకు నెట్టేసిందది.

ఇక్కడ అడ్డగించడానికంటూ ఏదీ మిగల్లేదు.
ఈ కానుగచెట్టు ప్రతి ఒక్కదాన్నీ తనలోకి
లాక్కుంటున్నది, చివరికి నన్ను కూడా
నోరారా కబళిస్తూండటమే దాని దినచర్య.

11-3-2026

# వసంతం వచ్చే ముందు

అదెలా ఉంటుందంటే ఒక సంపన్న గృహస్థుడి ఇంటిముందు నిల్చున్నాను. ధగధగ లాడుతున్న ఆ ఇంట్లోకి తొంగి చూస్తున్నాను. అతనికి నేనెవరో తెలీదనుకుంటాను, అయినా లోపలకి రమ్మన్నాడు. నన్ను స్వయంగా మేడమీద గదిలోకి తీసుకెళ్ళాడు. లైటు వేసాడు. కళ్ళు మిరుమిట్లుగొల్పేటంత వెలుగు. నేను నిద్రలోకి జారిపోయాను. వరదల్లో ఇరుకున్నాను. మళ్ళా ఎట్లానో ఆ ఇంటిముందున్నాను. ఈ సారి నన్ను మేడ మీద మరో అంతస్తుకి తీసుకెళ్ళాడు. లైటు వేసాడు. కళ్ళుమిరుమిట్లు గొల్పేటంత కాంతి. నాకు నిద్రపట్టేసింది. నిద్రలోనే దంతం ఊడిపోయింది. మళ్ళా ఎట్లానో కళ్ళు నులుముకుంటూ ఆ ఇంటిముందు నిల్చున్నాను. ఈ సారి మూడో అంతస్తుకి తీసుకెళ్ళాడు. ఆ గదినిండా షాండ్లియర్లు. నాకు కళ్ళు మూతలు పడిపోయాయి. ఎవరో నన్ను వదిలిపెట్టి నా మిత్రుల్ని తమ కారెక్కించుకున్నారు. ఒక్కణ్ణీ ఎలానో దారి వెతుక్కుంటూ మళ్ళా ఆ యింటిముందుకు చేరుకున్నాను. మళ్ళా మరో అంతస్తుకి తీసుకెళ్ళాడు. ఆ అద్దాల గదిలోకి ఆకాశం ప్రవహిస్తోంది. అక్కడ అన్నాఅఖ్మతోవాని కలుసుకున్నాను. ఆమెతో మాట్లాడుతూనే నిద్రపోయాను, కాని అంతస్తుమీద అంతస్తు అధిరోహిస్తూనే ఉన్నాను.

12-3-2026

# ఫాల్గుణమాసంలో రంజాన్

తెల్లవారుతూనే ఈ చెట్టు రోడ్డుమీదకీ
వలపన్ని కూచుంటుంది. చాలాకాలం
పాటు వెతుక్కునేవాణ్ణిందులో, కొండలూ
కోనలూ నా చిన్నప్పటివి చిక్కుతాయని.

ఇప్పుడు నా దృష్టి గతాగతాలమీద లేదు.
పరికిస్తున్నాను ఆ ఆకుపచ్చని వలని,
దాని కంతల్లోంచి కారిపోతున్న వెలుగుని,
దానిలోపల చిక్కబడుతున్న దగ్గరితనాన్ని.

రోజంతా ఆకాశం మీద వలలు విసిరాక
సాయంకాలానికి ఈ ఋతువు పోగేసుకునేది
ఉపవాసదీక్ష ముగించేవేళల నిశ్శబ్దం.
దానికి నిన్నతో పనిలేదు, రేపటి ధ్యాసలేదు.

13-3-2026

## నిజంగా నిద్రలేచినవాళ్ళు

నిద్రపోతున్నవాళ్ళని ఒక్కొక్కర్నీ పేరుపేరునా
లేపడం ఒక పనిగా జీవించాను బహుకాలం.
నెమ్మదిగా గ్రహించాను, నేడు డ్రిల్లుమాస్టరు
రేపు డిక్టేటరు కావటానికెంతో దూరం లేదని.

నిద్రలేవని వాళ్ళమీద అసహనం మొదలవుతుంది
మొదట్లో ముఖం మీద నీళ్ళుపోసి నిద్రలేపడం
ఒక వినోదంగానే ఉంటుంది. కాని నేడు నీళ్ళు
పోసిన వాళ్ళే రేపు నిప్పులు కూడా పొయ్యగలరు.

చూస్తూ ఉండగానే చెట్టు చిగురించింది, ఎప్పుడు
తలెత్తాయో కళ్ళు విప్పుకుంటున్నవి కానుగమొగ్గలు.
నిజంగా నిద్రలేచినవాళ్ళు చేసేదిదే: చల్లగా
నిద్ర లేచి తమపని తాము చేసుకుంటారు.

14-3-2026

# సద్గోష్ఠిసమానం

మధ్యాహ్నం మూడున్నర. దేవాలయాలముందు
పూలదుకాణాలు తెరిచే వేళ. ఇన్ని నీళ్ళు
చిలకరిస్తే చాలు మల్లెలు చందనమైపోతాయి.
ఇప్పుడు ప్రతి ఒక్క చెట్టూ ఒక మధ్యాహ్నహారతి.

ఎక్కణ్ణుంచి ప్రవేశిస్తుంది మామిడిచెట్టులోకి
అంత పచ్చదనం? ఇప్పుడు ప్రతి ఒక్క పక్షీ,
పడవా అక్కడ కొంతసేపు ఆగుతాయి. ఫాల్గుణ
మాసపు ఒక చెట్టునీడ ఒక గోష్ఠిసమానం.

ఏ పెళ్ళికో, పండక్కో చుట్టాలొచ్చినప్పటి ఇల్లు
లాగా గలగల్లాడే నీడ. మళ్ళా ఆ అతిథుల్లో
ఏ ఒక్కర్ని చూసినా ఎంత తీరిక! బహుశా
ఇలాంటప్పుడే వారు తమకి తాము దగ్గరయ్యేది.

16-3-2026

## దాగుడుమూతలాట

కనుక చెప్పగలను, పైకి కనిపించకపోయినా
చెట్టువీ నావీ వేర్లు పరస్పరం అల్లుకున్నాయని.
అక్కడ కొమ్మకొమ్మనా కాంతి చేరుతుంటే ఇక్కడ
నేనొక్కచోట కూడా నిలకడగా నిలబడకున్నాను.

చిగురించే వేళల్లో చెట్టుముందు నిలబడ్డ ప్రతిసారీ
మాటల కోసం తడుముకుంటాను. ఆ కొత్త భాష
అర్థంకాడానికి పూర్వకవుల పద్యాలు తిరగేస్తాను.
ఏం చెప్పను! వాళ్ళకీ వాళ్ళ పూర్వకవులే దిక్కు.

ఆ చెట్టు వెనక నిలబడి ఎవరో నన్ను పిలుస్తున్నారు
ఇదొక చిత్రమైన దాగుడుమూతలాట. తప్పదు, నేను
కూడా గంతలు కట్టుకుంటాను: కనిపించని వారు
కనిపించడానికి; కనిపించే వారు కనిపించకపోడానికి.

17-3-2026

# పూర్తిగా కళ్ళు విప్పుకుని

(ఆధునిక చీనా కవుల్లో ఫెంగ్-ఝి (1905-93) కొన్నాళ్ళు జర్మనీలో చదువుకున్నాడు. ఆధునిక జర్మను కవుల్ని ఆధునిక చీనాకి పరిచయం చేసాడు. 1941 లో, ఒకవైపు చీనా విప్లవం వైపు ప్రయాణిస్తుండగా, మరొక వైపు అతడు జర్మన్ మహాకవి రిల్కె స్ఫూర్తితో తన అంతరంగ ప్రపంచంలోకి సాహసయాత్ర చేస్తూన్నాడు.)

పూర్తిగా కళ్ళు విప్పుకుని మెలకువగా
ఉన్నామనుకున్నప్పుడు కూడా, మన
కళ్ళు అరమోడ్పుగా ఈ ప్రపంచంలోనే
మరొక ప్రపంచాన్ని గుర్తుపడుతుంటాయి.

రోడ్డుమీద ప్రయాణిస్తుంటామా, వాహనాలు
హారన్లు, ట్రాఫిక్, సిగ్నళ్ళు, పనితొందర-
వీటిమధ్యనే కానుగ చెట్లమీద పసిడి రాలడం
చూస్తుంటాం, అక్కడే ఆగిపోతుంటాం కూడా.

అలా ఆగిపోయినవాడు ఏ చీనాకవితోనో
రాత్రి మళ్ళా నీ తలుపు తడతాడు. అర్థరాత్రి
నీ నిద్రాద్వారం దగ్గర అరమోడ్పు కళ్ళతోనే
వాళ్లనొక జర్మను కవితలో పోల్చుకుంటావు.

20-3-2016

## మనమెక్కడున్నాం?

మిస్సైళ్ళు, మంటలు, హాహాకారాలు, చరిత్ర
చెప్పే పాఠాలు తలకెక్కని యుద్ధోన్మాదం,
ఇప్పుడు మీదీ నాదీ కూడా లోపలా బయటా
మసిబారిన విషవాయువిధూత గగనతలం.

మీకులానే నేను కూడా ట్రంపు పక్కన లేను
తన మధ్యయుగాల సామ్రాజ్యాన్ని నిలుపుకోడానికి
స్వాతంత్ర్య పోరాటం చేసిన ఖొమేనీతోనూ లేను
ఉన్నాడో లేడో తెలియని నేతన్యాహూతో అసలేలేను.

మరెక్కడున్నాం మనం? టెహరానులో ఉన్నాం,
నిర్వాసిత లెబనానుతో పాటు టెల్ అవీవ్ లోనూ
ఉన్నాం, ఆ సాజిరీ తయ్యేబా ఎలిమెంటరీ స్కూల్లో
దగ్ధమైన గులాబీల్తో పాటు మనమూ మాడిపొయ్యాం.

24-3-2026

# ముంగిట్లో నీళ్ళగోలెంలాగా

రెండు ప్రపంచాలనుకున్నాను, కాదు మూడు
ప్రపంచాలు. బయట ప్రపంచానికి మరీ బయట
మరో ప్రపంచముంది. యుద్ధాలు జరిగేదక్కడే.
మారణాయుధాల, మందుపాతరల ప్రపంచం.

దానికి లోపల మరొక ప్రపంచముందే, అక్కణ్ణుంచే
యుద్ధాలు తలెత్తేది. ఊసుపోక కబుర్లు, అరిగీ
అరగని అనుభవాలు, నిలదొక్కుకోని నమ్మకాలు,
పైపైనే జీవించేవాళ్ళ  వేళ్ళమరకలు, ఊపిరి మరకలు.

దాన్ని దాటాకనే నీ అసలైన ప్రపంచం. కాళ్ళూ
చేతులూ కడుక్కుని మరీ ఇంట్లో అడుగుపెట్టినట్టు
ముందీ పరిమళాల్తో నువ్వు తేటపడాలి. అందుకనే
ముంగిట్లో నీళ్ళగోలెం లాగా, విరబూసిన వేపచెట్లు.

25-3-2026

# పరిమళస్పర్శ

సాయంత్రం అయిదు. వీథుల్లోనూ
ఇళ్ళమీదా, చెట్లమీదా ఎండ చార.
బాల్కనీలో నిలబడ్డాను. నాచుట్టూ
రగులుతున్నది వేడికాదు, పూలతావి.

విరిగిన ఇనుపముక్కల్లాగా ఎప్పటినుంచో
మనసులో ఇరుక్కున్నవెన్నో వ్యథలు
ఆ పరిమళస్పర్శకి పూచికలాగా రాలిపడ్డాయి
వైద్యుడు లేకుండానే మందు దొరికింది.

కొంతసేపటికి చంద్రుడొస్తాడు. చైత్రమాసపు
తీపిగాలికి పాలసముద్రపు జిడ్డు తోడవుతుంది
రాలిపడ్డ పూలరేకలదే ఈ రోజు యుద్ధంలో
పైచేయి. రేపటి సంగతి చెప్పలేను.

31-3-2026

## కవీ, కోకిలా, లోకమూ

కవి కూడా న్యూసుపేపరు చదువుతాడు
సోషలుమీడియా పోస్టులు ఫాలో అవుతాడు
కాని ఎన్నేళ్ళు గడిచినా ఆ భాషపట్టుబడదు
ఎప్పటికీ పరాయిభాషగానే మిగిలిపోతుంది.

ఎప్పటికన్నా తమకి పనికొచ్చేలా రాస్తాడా
కవీశ్వరుడని ఎదురుచూస్తుంటుంది లోకం
తననెవరు పలకరించినా, పాపం, వాళ్ళకి
తన అక్షరాలు నేర్పాలని చూస్తుంటాడు కవి.

ఇంతలో కాలనీలో అడుగుపెడుతుంది కోకిల.
ఆ కూజితం వినగానే ఎక్కడెక్కడి కవులో
ఎప్పటెప్పటివారో ఓయంటూ బదులుపలుకుతారు.
ఇక లోకం కేసి చూడమన్నా చూడడు కవి.

31-3-2026

## చైత్ర చంద్రబింబం

You searched for an answer but lived without an answer. ..
Czeslaw Milosz (Provinces, Youth, 1991)

ఎండచల్లబడుతూనే మామిడిచెట్లగుబుర్లలో
వాద్యాలు శ్రుతి పెడుతున్న సంగీతకారులు.
కొమ్మలకి కొత్త తోరణాలు కట్టుకున్న
కోవిదార, కరవీర, దేవగన్నేరు.
వీథికి అటూ ఇటూ రంగుకాగితాలు
చుడుతున్న బోగన్ విల్లియా.
ఆకుపచ్చనిగోడల్ని కలుపుతూ
జలతారుపోగుల్తో ఊయెల నేస్తున్న
రెడ్ వెంటెడ్ బుల్బుళ్ళు. ఇక చీకటి
పడటం ఆలస్యం పూర్ణచంద్రుడికోసం
గాలి లాలిపాటలు మొదలుపెడుతుంది.

2

నాకేంచేయాలో తెలీటం లేదు,
నాకేం చెప్పాలో తెలీటం లేదు.
పదే పదే టెహరాన్ అని
నాలో నేను గొణుక్కుంటాను
కరెంటులేని, నీళ్ళు లేని, రొట్టెల్లేని,
బతకడానికి భవిష్యత్తులేని

టెహరాన్! టెహరాన్!
కొత్త ఏడాదికి స్వాగతంపలకడానికి
ఒక్క పూలగుత్తి కూడా దొరకని టెహరాన్!

తలలు తెగిన మొండేలు,
మొండేలు విడివడ్డ తలలు
రెండూదగ్గరపెట్టి పోల్చుకుంటున్న స్త్రీపర్వం.
వ్యాసుడు కూడా చేతులెత్తేసే ఘట్టమిది.

పదే పదే యురిపిడిస్ గుర్తొస్తున్నాడు
మండుతున్న ట్రాయినగరం మధ్య స్త్రీశోకం తప్ప
యుద్ధమంటే మరేదీ గుర్తులేదతడికి.

జీవితమంతా యుద్ధాలు చూసి, యుద్ధాలు చేసి
దు–ఫు తేల్చిందొక్కటే: యుద్ధధూమం నల్లన
మనిషి ఎముకలు తెల్లన.

యుద్ధం వెనక యుద్ధం చూస్తూ వచ్చారుగనుకనే
యుద్ధమంటే ఏమీ చెప్పలేకపోతున్నారు పోలిష్ కవులు.

12,00,000 మంది నిరాశ్రయశిశువుల ఎదట
రూమీ, ఖయ్యాం, హాఫిజ్, అత్తర్ లను
పలకరించాలంటే భయమేస్తోంది.

దాస్యం నుంచి దాస్యానికి,
దుఃఖం నుంచి దుఃఖానికి–
*“ఒంటరిగా ఒంటరిగా మంటల్లో మంటల్లో*
*పయనిస్తున్నాడు నరుడు*
*తానెరుగని దిక్కుకేసి*[1]

## 3

లేదు, నాకు సాధ్యం కాదు.
ఈ రెండు ప్రపంచాల్నీ
ఒక్కచోట ముడేసుకోలేకపోతున్నాను.
ఈ ప్రపంచంతో ఆ ప్రపంచాన్ని ఏమార్చలేను
ఆ ప్రపంచంతో ఈ ప్రపంచాన్ని కాదనలేను.

ఈ ప్రపంచంలో ఎక్కడ ఎవరు గాయపడ్డా
ఆ నొప్పి మనది కాదనుకోలేం
ఈ ప్రపంచంలో ఎక్కడ ఎవరు నిర్వాసితులైనా
మన తలపుల్లోనే కదా తలదాచుకోవలసింది.

లేదు, నాదగ్గర జవాబుల్లేవు
యుద్ధానికి వెళ్ళిన బిడ్డను తలుచుకుంటూ
శూన్యంలోకి చూస్తుండే తల్లిదండ్రుల్లాగా
ఈ చెట్టుకింద కూలబడతాను
ఈ పక్షుల ఎదట కూలబడతాను
ఈ జలతారు ఊయెల్లో తనలో తను నవ్వుకుంటున్న
చైత్రచంద్రబింబం ముందు కూలబడతాను.

2-4-2026

---

1. బైరాగి: నూతిలో గొంతుకలు

## ఈ రోజుకి మాత్రం

నిన్నటి సంగతి తెలీదు, రేపటి గురించి చెప్పలేను
ఈ రోజుకి మాత్రం మానవుడు గెలిచింది నిశ్చయం.
తెల్లవారుతూనే బుల్బుల్ గొంతెత్తి పాడుతున్న పాటతో
ఈ ప్రభాతాన నా గుండె గులాబితోటగా మారింది.

ఇంతదాకా నడిచిన ప్రపంచయుద్ధాలు రెండేనా?
ఇప్పుడు ప్రతి ఒక్కడూ యుద్ధక్షేత్రంలో నిలబడ్డవాడే
దగ్ధప్రపంచంలో నేడు ప్రతి ఒక్కడూ క్షతగాత్రుడే.
యుద్ధం ఎక్కడ జరిగినా దేశాలన్నీ నెత్తుటిమయమే.

ఎవరూ ఎవరికీ ఓదార్పునివ్వలేని గాఢాంధకారంలో
వాళ్ళు నిన్నరాత్రి తమ వట్టిచేతుల్తో కలిసికట్టుగా
బాంబుల వర్షానికి ఎదురేగారే అప్పుడు మటుకే
తాము బతికి ఈ ప్రపంచమంతటినీ బతికించారు.

8-4-2026

# క్రమం తప్పని కోకిల

ఈ చైత్రమంతా ఇళ్ళు, వీథులు, భవనాలు
చివరికి గోడలమీద కూడా ఆకుపచ్చ వెలుగు
మరొకవైపు నా నిద్రలో, మెలకువలో రంపాలు
మనిషి మనిషిని వధిస్తున్న దృశ్యాలు, వార్తలు

ఈ రెండు ప్రపంచాల్నెలా కలుపుకోవాలో తెలీదు
వధించేవాడూ చిత్రవధకి గురవుతున్నవాడూ ఇద్దరూ
నా బతుక్కి అర్థం లేకుండా చేస్తున్నారు, పూల
గాలులు కురిపిస్తున్న తేనెలో విషం కలుపుతున్నారు.

అశక్తుడిగా రోజు గడుపుతాను, నిస్సహాయంగా
నిద్రలోకి జారుకుంటాను. ధైర్యం చెప్పే ఒక్క
మనిషి కూడా కనిపించడు, ఒక్క మాట కూడా
వినిపించదు. ఒక్క సత్యం కూడా అగుపించదు.

మళ్ళీ మళ్ళీ చెట్లకేసి చూస్తాను. అవి ఏదో ఒక
సత్యం కోసం బతకవు, ఏదో ఒక సత్యం కోసం
మరణించవు. తామే సత్యంగా మారిన తావులవి.
ఆ సత్యం తెలుసు కాబట్టే కోకిల క్రమం తప్పదు.

14-4-2026

వాడ్రేవు చినవీరభద్రుడు

# జ్యోతిర్మయ రోదసి

## మరికొన్ని కవితలు

‘నిర్వికల్ప సంగీతం’ (1986) తో మొదలుపెట్టిన వాడ్రేవు చినవీరభద్రుడి సాహిత్య ప్రయాణం నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకుంది. ‘కోమల నిషాదం’ (2025) తరువాత రాసిన 62 కవితల్తో వెలువరిస్తున్న ఈ ‘జ్యోతిర్మయ రోదసి’ ఆయన తొమ్మిదవ కవితా సంపుటి. చినవీరభద్రుడు వెలువరిస్తున్న స్వీయ రచనలు, అనువాదాలు, సంకలనాలు మొదలైన పుస్తక పరంపరలో ఇది 77వ పుస్తకం. పుస్తకప్రేమికుల్లో ముందువరసలో ఉండే కొప్పరపు లక్ష్మీనరసింహారావుగారికి ఇది ఆత్మీయకానుక.

